# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఇంధన పరిరక్షణకు భారత్ గణనీయమైన చర్యలు తీసుకుంటోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు చక్రవర్తి పెరుంబిడుగు ముత్తరైయర్-II సువరన్ మారన్ గౌరవార్థం ఒక స్మారక తపాలా బిళ్ళను న్యూఢిల్లీలో విడుదల చేశారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుండి రెండు రోజుల పాటు జోర్డాన్ దేశంలో పర్యటించనున్నారు.
- ❖ స్క్వాష్‌లో భారత జట్టు హాంకాంగ్ పై విజయం సాధించి మొదటిసారిగా స్క్వాష్ ప్రపంచ కప్‌ను గెలుచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం. ఇంధన పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహనను పెంపొందించడంతో పాటు ఇంధన సామర్థ్యంలో దేశం సాధించిన విజయాలను వెల్లడించేందుకు న్యూఢిల్లీలో జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు (NECA) 2025 కార్యక్రమం ఈరోజు జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ కార్యక్రమంలో పాల్గొని, జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు గ్రహీతలను, ఇంధన పరిరక్షణపై నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీ-2025 విజేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... ఇంధన పరిరక్షణ ప్రస్తుత కాలానికి ఒక ఆవశ్యకత అని పేర్కొన్నారు. పొదుపు చేసిన ప్రతి యూనిట్ ఇంధనం.. ప్రకృతి పట్ల మన బాధ్యతను గుర్తు చేస్తుందని, అలాగే భావితరాల పట్ల శ్రద్ధను తెలియజేస్తుందని వివరించారు. భారతదేశం ఇంధన పరిరక్షణ, స్వచ్ఛమైన ఇంధన పరివర్తన రంగాలలో గణనీయమైన చర్యలు తీసుకుంటోందన్నారు. మెరుగైన ఇంధన సామర్థ్యం, డీ కార్బనైజేషన్ దిశగా ఇది ఒక కీలక విజయాన్ని సూచిస్తుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు చక్రవర్తి పెరుంబిడుగు ముత్తరైయర్ -II సువరన్ మారన్ గౌరవార్థం ఒక స్మారక తపాలా బిళ్ళను న్యూఢిల్లీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. తమిళ సంస్కృతి, భాషకు ప్రభుత్వం గొప్ప ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. కాశీ తమిళ సంగమంతో సహా పలు కార్యక్రమాలను ప్రస్తావించిన ఆయన.. తమిళ రాజులు, నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులకు తగిన గుర్తింపు, గౌరవం అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. చక్రవర్తి పెరుంబిడుగు ముత్తరైయర్ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేయడం కూడా ఇందులో భాగమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుండి రెండు రోజుల పాటు జోర్డాన్ దేశంలో పర్యటించనున్నారు. భారత్ - జోర్డాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానమంత్రి పర్యటన.. వాణిజ్యం, ఆహార భద్రత, ప్రజల మధ్య సంబంధాలకు ఒక మైలురాయి వంటిదిగా జోర్డాన్‌లోని భారత రాయబారి మనీష్ చౌహాన్ అభివర్ణించారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-II బిన్ అల్ హుస్సేన్ ఆహ్వానం మేరకు జరుగుతున్న ఈ పర్యటనలో తొలి పూర్తి స్థాయి ద్వైపాక్షిక ఒప్పందం జరుగుతుందని చెప్పారు. భారత్ జోర్డాన్ లు బలమైన, స్థిరమైన ఆర్థిక సంబంధాలను పంచుకుంటాయని అలాగే భారత్.. జోర్డాన్ కు మూడవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అవతరిస్తుందని వివరించారు. భారత వ్యవసాయ రంగానికి కీలకమైన ఫాస్ఫేట్, పొటాష్ మొదలైన ఎరువులను జోర్డాన్ సరఫరా చేయనుందని.. ఇది భారతదేశ ఆహార భద్రతను మరింత పటిష్టం చేయనుందని మనీష్ చౌహాన్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్క్వాష్‌లో భారత జట్టు మొదటిసారిగా హాంకాంగ్ జట్టుపై విజయం సాధించి, స్క్వాష్ ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. చెన్నైలో ఈ సాయంత్రం జరిగిన ఫైనల్ పోరులో ఆతిథ్య జట్టు హాంకాంగ్‌ను 3-0 తేడాతో ఓడించింది. ప్రపంచ ర్యాంక్ 37వ స్థానంలో ఉన్న లీ కా యి ని 3-1 తేడాతో ఓడించిన జోష్నా చినప్ప భారతదేశానికి విజయ ఆరంభాన్ని అందించారు. ప్రపంచ 29వ స్థానంలో ఉన్న భారత పురుషుల స్క్వాష్ ఆటగాడు అభయ్ సింగ్, అలెక్స్ లా పై 3-0 తేడాతో విజయం సాధించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సీనియర్ నాయకుడు నితిన్ నబిన్ ఈరోజు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి, బిజెపి సీనియర్ నాయకుడు నరేంద్ర మోదీ నితిన్ నబిన్‌ను అభినందించారు. ఆయన పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తగా గుర్తింపుపొందారని సోషల్ మీడియా పోస్ట్ లో పేర్కొన్నారు. ఆయన గొప్ప సంస్థాగత అనుభవం కలిగిన యువ నాయకుడని, బీహార్‌లో ఎమ్మెల్యేగాను, మంత్రిగాను అనేక సార్లు పని చేశారని అన్నారు. నితిన్ నబిన్ శక్తి, అంకితభావం భవిష్యత్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తాయని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆస్ట్రేలియాలోని బోండి బీచ్‌లో ఈరోజు జరిగిన ఉగ్రవాద దాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో ఆస్ట్రేలియా ప్రజలకు భారతదేశం సంఘీభావంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎంతమాత్రం

సహించబోదని, ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి భారత్ ఎల్లప్పుడు మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈ ఉగ్రవాద దాడిని ఖండిస్తూ.. భారత ప్రజలు బాధితుల పక్షాన నిలుస్తారని సామాజిక మాధ్యమం పోస్టులో వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెలలో జరగవలసిన క్రీడా పోటీలను వాయిదా వేయాలని జాతీయ రాజధాని, పరిసర ప్రాంతాల వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (CAQM).. ఢిల్లీ, నేషనల్ కేపిటల్ రీజియన్ (NCR) ప్రభుత్వాలను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉటంకిస్తూ.. NCR అంతటా గాలి నాణ్యత క్షీణిస్తున్న ప్రస్తుత సమయంలో బహిరంగ శారీరక క్రీడా కార్యకలాపాలను కొనసాగించడం పిల్లల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుందని CAQM పేర్కొంది. అలాగే.. బహిరంగ శారీరక క్రీడా కార్యకలాపాలను నిలిపివేయాలని, తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలు, క్రీడా సంస్థలకు సూచించింది. ఆదేశాల అమలును నిశితంగా పర్యవేక్షించాలని కమిషన్.. స్థానిక అధికారులను ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలంగాణ, కర్నాటకలోని కొన్ని ప్రాంతాల్లోను రేపు చలిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. రానున్న నాలుగు రోజుల్లో నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలలో దట్టమైన పొగమంచుతో కూడిన వాతావరణం ఉంటుందని పేర్కొంది. అలాగే అస్సాం, మేఘాలయ, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీలలో రానున్న 2 రోజులు ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉంటాయని వివరించింది. ఇదిలా ఉండగా రేపు అండమాన్, నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణాలి మంజుధార్ తెలియజేస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో ఈశాన్య ప్రాంతం ముందంజలో నిలిచిందని ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. ఓ పత్రికకు రాసిన కథనంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధానమంత్రి సారథ్యంలో ఈశాన్య ప్రాంత ఆర్థిక, మానవ సామర్థ్యాలు వెలుగుచూశాయన్నారు. ఈ పరివర్తనకు హార్న్ బిల్ ఫెస్టివల్ ఆఫ్ నాగాలాండ్ ఒక సాంస్కృతిక చిహ్నంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కథనంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక సామాజిక మాధ్యమం పోస్టులో స్పందిస్తూ.. దేశ అభివృద్ధి ఈశాన్య ప్రాంత అభివృద్ధితో ముడిపడి ఉందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడో టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టు 16 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి 80 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రైల్వేల బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్ లైన్ల విద్యుదీకరణ 99 శాతం పూర్తయినట్టు రైల్వే మంత్రిత్వ శాఖ తెలియజేసింది. 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో విస్తరించి ఉన్న మొత్తం బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్‌లో విద్యుదీకరణ త్వరలో పూర్తి కానుందని పేర్కొంది. 2019 - 2025 మధ్య 33 వేల కిలోమీటర్లకు పైగా విద్యుదీకరణ జరిగిందని వివరించింది.

========================

========================